www.prajasakti.com
ప్రజాశక్తి
మంగళవారం 9 జులై 2024
5
ఏలూరు

అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలి

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో జెసి లావణ్యవేణి

ఏలూరు : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను పెండింగ్ లేకుండా త్వరితగతిన నాణ్యతతో పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, డిఆర్ఒ డి.పుష్పమణి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిప్యూటీ కలెక్టర్లు భాస్కరరావు, ముక్కంటి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీతో కలిసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కారం వ్యవస్థలో 234 అర్జీలు స్వీకరించినట్లు జెసి తెలిపారు. జాయింట్ కలెక్టర్ లావణ్యవేణి మాట్లాడుతూ వివిధ సమస్యల పరిష్కారం కోసం ప్రజల నుంచి అందిన అర్జీలను సంబంధత అధికారులు నాణ్యతతో నిర్దేశిత కాలపరిమితిలో పరిష్కరించాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి అలసత్వానికి తావులేదన్నారు.

తవ్వారు.. వదిలేశారు..!

ప్రమాదకరంగా పుట్రేపు రోడ్డులో కల్వర్టు
భయాందోళనలో వాహనదారులు
కల్వర్టులు పూర్తి చేయాలని గ్రామస్తుల డిమాండ్

పుట్రేపు సమీపంలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని పుట్రేపు వెళ్లే రోడ్డులో ఊరగుంట చెరువు వద్ద కల్వర్టు నిర్మాణానికి రోడ్డుకు ఇరువైపులా గోతులు తవ్వి నిర్మించకుండా కాంట్రాక్టర్లు వదిలేయడంతో ఆ కల్వర్టు గోతులు ప్రమాదకరంగా మారాయి. వర్ష ప్రభావానికి వరద నీరు వస్తే రోడ్డు తెగిపోయే అవకాశం ఉందని, దీంతో ఏ క్షణాన ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. కల్వర్టు నిర్మించకుంటే ఆర్‌టిసి సౌకర్యం రద్దు చేస్తామని వారంటున్నారు. వెంటనే కల్వర్టులు పూర్తి చేసి రోడ్డు నిర్మించాలని పుట్రేపు, ప్రకాష్ నగర్, రుద్రకోటరాజుగూడెం, బండివారిగూడెం గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

మండలంలోని మక్కినవారిగూడెం - టి.నరసాపురం అడ్డురోడ్డు నుంచి బండివారిగూడెం వరకూ 3.9 కిలోమీటర్ల మేర ఉన్న పుట్రేపు రోడ్డు 15 ఏళ్లుగా అధ్వానంగా ఉంది. గత వైసిపి ప్రభుత్వంలో రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రూ.కోటీ 45 లక్షలు పంచాయతీ రాజ్ నిధులు మంజూరు చేశారు. ఈ క్రమంలో గత ఫిబ్రవరిలో ఎన్నికలకు ముందు రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టు దారులు జెసిబితో రోడ్డుకు ఇరువైపులా మట్టితవ్వి, జంగిల్ తొలగించారు. అదేవిధంగా బండి వారిగూడెం, పుట్రేపు, ప్రకాష్ నగర్ సమీపంలో మూడు కల్వర్టులు నిర్మించేందుకు నీటి పైపులు, కంకర, ఇసుక మెటీరియల్ కూడా తోలారు. అయితే ఊరగుంట చెరువు వద్ద ఉన్న పాత కల్వర్టు తొలగించి కొత్తగా పెద్ద పైపులు పెట్టి నిర్మించేందుకు రోడ్డుకు ఇరువైపులా గోతులు తవ్వారు. గోతులు తవ్వి నెలలు గడుస్తున్నా వాటి నిర్మాణం చేపట్టకపోవడంతో కల్వర్టుల వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. కల్వర్టుల వద్ద రోడ్డుకు ఇరువైపులా గోతుల వల్ల ఇరుగ్గా ఉండడంతో ఎప్పుడు ప్రమాదం ముంచుకొస్తుందోనని వాహనదారులు భయాందోళనకు గురవుతున్నారు. ఆర్‌టిసి బస్సులు, లారీలు వెళ్లాలంటే పెద్ద వాహనాలు కావడంతో మట్టి కుంగి వాహనాలు తిరగబడే అవకాశం ఉందని డ్రైవర్లు చెబుతున్నారు. వర్షాకాలం కావడంతో నీటి ప్రవాహానికి రోడ్డు తెగిపోతుందని, అలా జరిగితే రాకపోకలు నిలిచిపోతాయని ప్రజలకు ఇబ్బందులు తప్పవని పుట్రేపు, బండివారిగూడెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు చెబుతున్నారు. కల్వర్టులు నిర్మించకుంటే ఆర్‌టిసి బస్సు సేవలు నిలిపివేస్తామని ఆర్‌టిసి అధికారులు చెబుతున్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టుల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని. రోడ్డు అభివృద్ధి చేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.

ఉద్యోగం చేయాలనే ఆశలు ఆవిరి

ఆగిఉన్న కంటెయినర్‌ను ఢీకొన్న కారు
ఇంటర్వ్యూకు హైదరాబాద్ వెళ్లి వస్తుండగా మృత్యు ఒడిలోకి
ముగ్గురు మృతి, డ్రైవర్, బాలుడి పరిస్థితి విషమం

తీవ్రంగా గాయపడిన డ్రైవర్

ప్రజాశక్తి - ద్వారకాతిరుల, ఉంగుటూరు

ప్రమాదంలో మరణించిన రాచాబత్తుని భాగ్యశ్రీ ఇంజినీరింగ్ చదివింది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేయాలని ఎన్నో కలలు కంది. ఇంటర్వ్యూకు వెళ్లి ఉద్యోగానికి ఎంపికైంది. మరికొద్ది రోజుల్లో అపాయింట్మెంట్ ఆర్డర్ వస్తుందని సంతోషంతో కుటుంబ సభ్యులతో తిరిగి ఇంటికి ప్రయాణమైంది. ఇంతలోనే విధి మృత్యు రూపంలో వారిని కబలించింది. తన ఇద్దరు కుమారుల్లో చిన్న కుమారుడు మృతి చెందగా మరో కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. తల్లి, అమ్మమ్మ మృతదేహాల వద్ద బాలుడిని చూసిన వారంతా కన్నీరుమున్నీరవుతున్నారు.

ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద రాజమండ్రి - గుండుగొలను హైవేపై సోమవారం ఉదయం 5.45 గంటలకు ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. రోడ్డు పక్కన ఆగి ఉన్న కంటెయినర్ లారీని వెనుక నుంచి కారు ఢీకొనడంతో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఒక బాలుడు ఉన్నారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.

భీమవరానికి చెందిన బొమ్మా నారాయణరావు, బొమ్మా కమలాదేవి (52), తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రి శివార్లలోని రాజవోలు గ్రామంలో ఉంటున్న తన కుమార్తె రాచాబత్తుని భాగ్యశ్రీ (28), మనవళ్లు రాచాబత్తుని నాగనితిన్ కుమార్ (4), రాచాబత్తుని శ్రీనాగషణ్ముఖ్‌తో కలిసి నాలుగు రోజుల క్రితం భాగ్యశ్రీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగం నిమిత్తం హైదరాబాద్ వెళ్లారు. తిరిగి ఆదివారం రాత్రి వీరంతా కారులో రాజవోలు బయలుదేరారు. అయితే నారాయణరావు పని నిమిత్తం విజయవాడలో దిగిపోయారు. మిగిలిన వారు రాజవోలు వస్తుండగా ద్వారకాతిరుమల మండలం లక్ష్మీనగర్ వద్ద హైవేపై రోడ్డు పక్కన ఆగిఉన్న కంటెయినర్ లారీని కారు బలంగా ఢీకొంది. ఈ క్రమంలో కమలాదేవి (52), భాగ్యశ్రీ (28), నాగ నితిన్‌కుమార్ (4) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన నాగషణ్ముక్, డ్రైవర్ దుర్గా వంశీని చికిత్స నిమిత్తం ఆశ్రమ హాస్పిటల్‌కు తరలించారు. కేసు నమోదు చేసినట్లు ద్వారకాతిరుమల ఎస్ఐ సతీష్ తెలిపారు. సంఘటన స్థలాన్ని జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి పరిశీలించి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

ముంపు మండలాల్లో కలెక్టర్ పర్యటన

ఇబ్రహీంపేటలో ప్రజా సమస్యలపై కలెక్టర్ ఆరా - పరిష్కరించాలని ఆదేశం

నిర్వాసితులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

కుక్కునూరు మండల ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. మండలంలోని ఇబ్రహీంపేటలో సోమవారం కలెక్టర్ పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు స్థానికులు తమ గోడు విన్నవించారు. తమకు పోలవరం ప్రాజెక్టు నష్టపరిహారం అందలేదని తెలిపారు. ముంపు మండలాల్లోని కొంత మంది ప్రజలకు సర్వేలో నమోదు చేయని కారణంగా నష్టపరిహారం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ అందించిన తరువాత మాత్రమే కాలనీలకు తరలించాలని నిర్వాసితులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ యువతకు సరైన ఉపాధి అవకాశాలు లేవని, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. నిర్వాసితులకు భూమికి భూమి పరిహారం సక్రమంగా అందలేదన్నారు. పెద్దరాయిగూడెంలోని ఉన్నత పాఠశాలలో, బోరప్పాడులోని పాఠశాలలో టాయిలెట్లు లేవని, ఉప్పెనపల్లి గ్రామంలోని పాఠశాల్లో టాయిలెట్లు, తాగునీటి సౌకర్యం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన కలెక్టర్ వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ అధికారులను ఆదేశించారు. పీసా చట్టం ప్రకారం మండలం ఎటువంటి సమావేశం నిర్వహించలేదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా వెంటనే చర్యలు తీసుకోవాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర విభజన సమయంలో తమ గ్రామంలో త్రీఫేజ్ విద్యుత్ కనెక్షన్ తొలగించారని, తమ పొలాలకు విద్యుత్ కనెక్షన్ లేక ఇబ్బంది పడుతున్నామని స్థానిక రైతులు కోరగా వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖాధికారులను ఆదేశించారు. మండలంలో ప్రతి సమస్యనూ పరిష్కరించేలా చర్యలు తీసుకుని నివేదిక అందించాలని తహశీల్దార్‌ను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు, ఆర్‌డిఒ కె.అద్దయ్య, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి, ఆర్‌టిఒ శ్రీహరి పాల్గొన్నారు.

నిలకడగా గోదావరి

పట్టిసీమ నుంచి విడదలవుతున్న జలాలు

ప్రజాశక్తి - పోలవరం

గోదావరిలో నీటి మట్టం సోమవారం నాటికి నిలకడగా మారింది. ప్రాజెక్టులోకి వస్తున్న గోదావరి జలాలను ఎప్పటికప్పుడు 48 గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్ వే ఎగువన 26.550 మీటర్లు, స్పిల్ వే దిగువన 16.570 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాంకి ఎగువన 26.590 మీటర్లు , దిగువ కాపర్ డ్యాంకి దిగువన 15.470 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు పోలవరం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు పి.వెంకటరమణ, మల్లికార్జునరావు తెలిపారు.

పట్టిసీమ నుంచి 6.018 క్యూసెక్కుల జలాలు విడుదల

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి 6.018 క్యూసెక్కుల గోదావరి వరద జలాలను దిగువకు విడుదల చేసినట్లు పట్టిసీమ ఎత్తిపోతల పథకం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పెద్దిరాజు తెలిపారు. సోమవారం పట్టిసీమలో గోదావరి నీటిమట్టం 14.902 మీటర్లకు చేరుకుందని, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు 17 పంపులు 17 మోటార్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల ఆరో తేదీ వరకు 1.3660, ఏడో తేదీ 0.5200 టిఎంసిలు విడుదల చేసినట్లు, ఇప్పటివరకు 1.8860 టిఎంసిల నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. గోదావరి నీటిమట్టం కృష్ణా డెల్టా నీటి అవసరతను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంపుల సంఖ్య మోటార్ల సంఖ్య పెంచనున్నట్లు తెలిపారు.

ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూముల్లో పేదలు, గిరిజనులు సాగుకు అవకాశం కల్పించాలి

వరి విత్తనాలు చల్లి సాగు చేపట్టిన వ్యకాస జిల్లా కార్యదర్శి రామకృష్ణ, పేదలు

ఎర్రకాలువ మిగులు భూముల్లో సాగు పనులు ప్రారంభించిన నేతలు, పేదలు

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూముల్లో గిరిజనులు, పేదలు సాగు చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని సాలిగూడం, అబ్బుల్లాపురం, మల్లప్పగూడెం, అప్పలరాజుగూడెం గ్రామాల పేదలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎర్రకాలువ మిగులు భూముల్లో దుక్కుదున్ని వరి గింజలు వేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ విత్తనాలు చల్లి సాగు పనులు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎర్ర కాలువ మిగులు భూముల కోసం పేదలు ఎనిమిదేళ్ల నుంచి వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పోరాడుతున్న రాష్ట్ర ప్రభుత్వం, ఇరిగేషన్ అధికారులు నిమ్మకునీరెత్తిన్నట్లు వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వమైనా పేదల పట్ల సానుకూలంగా వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. భూమిలేని పేదలకు మిగులు భూములు పంచాలని డిమాండ్ చేశారు. ఈ భూముల్లో పేదలు సాగు చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఇరిగేషన్, పోలీస్ అధికారులు భూస్వాములు ఇచ్చే లంచాల తిని పేదలపై అక్రమ కేసులు పెడుతున్నారని విమర్శించారు. ఎర్రకాలువ మిగులు భూముల్లో పేదలు, దళితులు, గిరిజనులు వారి హక్కుల కోసం పోరాడుతున్న వారిపైన ఇలాంటి అక్రమ కేసులు పెట్టడం సిగ్గుచేటన్నారు. పేదలు భూముల్లేక ఇబ్బందులు పడుతుంటే రిజర్వాయర్ మిగులు భూములు పంచాల్సింది పోయి అధికారులు భూస్వాములకు కట్టబెట్టే విధంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే చట్టాన్ని ధిక్కరిస్తే పేదలకు, గిరిజనులకు, దళితులకు ఎవరు న్యాయం చేస్తారని ప్రశ్నించారు. ఇరిగేషన్ అధికారులు తీరు మార్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. మిగులు భూములు పేదల సాగు చేసుకునేలా అధికారులు వ్యవహరించాలన్నారు. భూస్వాముల పట్ల కొమ్ముకాస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసులపై ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. రాత్రింబవళ్లు కష్టపడి పనిచేస్తూ వ్యవసాయం చేస్తున్న గిరిజనులపై చట్ట వ్యతిరేక పనులు భూస్వాములు చేయడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ప్రభుత్వం, జిల్లా ఇరిగేషన్, జిల్లా కలెక్టర్, రెవెన్యూ శాఖ అధికారులు కలుగజేసుకొని పేదలు, గిరిజనులకు న్యాయం చేయాలని కోరారు. లేని పక్షంలో పేదలు వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలకు సన్నద్ధమవుతారని, రాబోయే కాలంలో జరిగే పరిణామాలకు ఉన్నతస్థాయి అధికారుల బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గంగా భవానీ, చెల్లమ్మ, వెంకటేశ్వరరావు, శర్మయ్య, దుర్గమ్మ, పార్వతి, మహిళలు పాల్గొన్నారు.

తపస్ విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

డివైఎఫ్ఐ ఆధ్వర్యాన నిరసన

నిరసన తెలుపుతున్న డివైఎఫ్ఐ నేతలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న తపస్ విద్యాసంస్థల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డివైఎఫ్ఐ డిమాండ్ చేసింది. సోమవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నేతలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమానికి డివైఎఫ్ఐ సభ్యులు వినోద్ అధ్యక్షత వహించగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడారు. జంగారెడ్డిగూడెంలోని అశ్వరావుపేట రోడ్డులో తపస్ విద్యా సంస్థల యాజమాన్యం కొత్త భవన నిర్మాణాలు పూర్తి కాకుండానే మండలంలోని విద్యార్థులకు అడ్మిషన్లు తీసుకొని తరగతులు నిర్వహిస్తున్నారని తెలిపారు. విద్యాహక్కు ప్రకారం విద్యాలయాల భవనాలు నిర్మాణంలో ఉన్నప్పుడు తరగతులు నిర్వహించకూడదని చెబుతున్నా తపస్ విద్యా సంస్థలు తరగతులు నిర్వహించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. చట్టాన్ని అమలు చేయాల్సిన విద్యా సంస్థలే చట్టాన్ని ధిక్కరిస్తుంటే స్థానిక అధికారులు విద్యాశాఖ, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇలాంటి విద్యాసంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. భవన నిర్మాణం పూర్తి కాకుండా ఫైర్ సర్టిఫికెట్ లేకుండా చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్న తపస్ విద్యాసంస్థల యాజమాన్యంపై, వారికి అనుగుణంగా పనిచేస్తున్న ఎంఇఒ, సంబంధిత అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో అక్కడ ఏ విధమైన ప్రమాదాలు జరిగినా సంబంధిత అధికారులే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు.

మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాలి

అంగన్వాడీలో కేంద్రంలో కలెక్టర్ వెట్రిసెల్వి ఆకస్మిక తనిఖీలు

మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు / కుక్కునూరు రూరల్

అంగన్వాడీ కేంద్రాల్లో నిర్దేశించిన మెనూను కచ్చితంగా అమలు చేసి మంచి పౌషకాహారాన్ని అందించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కుక్కునూరు మండలంలోని మాధవరం పంచాయతీ దామచర్లలోని పోలవరం ప్రాజెక్ట్ నిర్వాసితుల కాలనీలో కలెక్టర్ సోమవారం పర్యటించి అక్కడ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, అక్కడ పిల్లలకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. అనంతరం సదరు ఆహారాన్ని తాను స్వయంగా రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం ఆహారాన్ని తప్పనిసరిగా అందించాలన్నారు. ఉదయం పాలు, మధ్యాహ్నం భోజనంలో కూర, సాంబారు, కోడిగుడ్డు అందించాలన్నారు. తాను వివిధ కార్యక్రమాల పర్యటనలో పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, మెనూ ప్రకారం భోజనం అందించకపోతే సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హెచ్చరించారు. ఎల్లప్పగూడేనికి చెందిన ప్రజలు తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో నగదు, ఇల్లు అందలేదని, తెలియజేయగా వెంటనే పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్‌తో పాటు ఆర్‌డిఒ కె.అద్దయ్య, తహశీల్దార్ పాల్గొన్నారు.

సరికొత్త ఫీచర్లతో ఎపిఇపిడిసిఎల్ మొబైల్ యాప్

ఎస్ఇ పి.సాల్మన్‌రాజు

ప్రజాశక్తి - ఏలూరు

ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఎపిఇపిడిసిఎల్) ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌ను సరికొత్త ఫీచర్లతో వినియోగదారులకు అందుబాటులోకి తీసుకొచ్చిందని ఏలూరు సర్కిల్ సూపరెంటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకొని వినియోగదారుని 16 అంకెల సర్వీసు నెంబర్ నమోదు చేసుకోవడం ద్వారా మొబైల్ యాప్ సేవలను పొందవచ్చున్నారు. ఈస్టర్న్ పవర్ మొబైల్ యాప్‌లో బిల్ పే ఆప్షన్ ద్వారా విద్యుత్ బిల్లులను ఎటువంటి అదనపు రుసుము లేకుండా అత్యంత సులభతరంగా చెల్లించవచ్చున్నారు. అంతేకాకుండా వినియోగదారుని సర్వీసుకు సంబంధించిన విద్యుత్ వినియోగం, బిల్లు వివరాలు, బిల్లు చెల్లింపు, విద్యుత్ సరఫరా పరిస్థితి వివరాలు తెలుసుకోవచ్చున్నారు. 'మై యుసెజ్' ఆప్షన్ ద్వారా విద్యుత్ మీటర్‌లో ఉన్న రీడింగ్ ప్రకారం కేవలం ప్రస్తుత వినియోగపు యూనిట్ల సంఖ్యను నమోదు చేయడం ద్వారా విద్యుత్ బిల్లును వినియోగదారులే యాప్ ద్వారా లెక్కించుకోవచ్చున్నారు. యాప్ ద్వారా ఆధార్ నంబర్‌కు విద్యుత్ సర్వీసును అనుసంధానం చేసుకోవడంతోపాటు విద్యుత్ సంబంధిత సమస్యలను ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పేటిఎం, ఫోన్ పే, జీ పేతో సహ ఇతర యుపిఐ యాప్‌ల ద్వారా బిల్లులు నేరుగా చెల్లించే విషయమై ఆర్‌బిఐ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ పాత విధానంలోనే నేరుగా ఫోన్‌పే, పేటీఎం, జీ పేల ద్వారా వినియోగదారులు బిల్లులు చెల్లించేందుకు వీలుగా బ్యాంకులతో సంప్రదింపులు జరుపుతున్నామని ఎస్ఇ పి.సాల్మన్‌రాజు తెలిపారు. సంస్థ వెబ్ సైట్ www.apeasternpower.com నుంచి కూడా బిల్లులు చెల్లించవచ్చున్నారు. ఎపిఇపిడిసిఎల్ మొబైల్ యాప్‌లో లేదా సంస్థ వెబ్‌సైట్‌లో గాని బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్ పే, జీ పే, పే టిఎం ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు నెట్ బ్యాంకింగ్, డెబిట్, క్రెడిట్, వాలెట్స్, క్యాష్ కార్డ్స్ కూడా వాడుకోవచ్చని సాల్మన్ రాజు తెలిపారు.

ముంపు ప్రాంతాల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

బలహీనంగా ఉన్న నది గట్లను పటిష్టం చేయాలి
అధికారులకు కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశాలు

ప్రజాశక్తి - ఏలూరు/వేలేరుపాడు

రెండు మూడు రోజులు నిరంతరాయంగా వర్షాలు పడుతూ ఉంటే అధికారులందరూ వరద ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రారంభించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. స్థానిక వేలేరుపాడు ఎంపిడిఒ కార్యాలయంలోని సమావేశపు హాలులో సోమవారం వరద ముందస్తు జాగ్రత్త చర్యలు, వరద ప్రమాదానికి ముందు, వరద సమయంలో, అనంతరం తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రస్తుతం ఎటువంటి వరద ప్రమాదం లేనప్పటికీ, వర్షాకాల సీజన్‌లో గోదావరి నదికి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు చర్యలపై అధికారులను అప్రమత్తం చేసేందుకు ఇప్పటికే రెండు సార్లు అధికారులతో సమీక్షించినట్లు చెప్పారు. గోదావరి నదికి భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసిన వెంటనే వరద ముందస్తు జాగ్రత్త చర్యలు ప్రారంభించాలని, నివారణ చర్యలు తీసుకునేందుకు కేవలం కొంత సమయమే ఉంటుందని, అప్పటివరకు వేచి ఉండకుండా రెండు మూడు రోజులపాటు నిరంతరాయంగా వర్షాలు కురుస్తూ ఉంటే వరద వచ్చే అవకాశం ఉంటుందని, అధికారులు ప్రజలను అప్రమత్తం చేసి సహాయక చర్యలకు సిద్ధం కావాలన్నారు. ముందుగా మొదటి, రెండవ, మూడవ ప్రమాద హెచ్చరికలకు వరద ముంపునకు గురయ్యే గ్రామాలను గుర్తించి, ఆయా గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలన్నారు. వేలేరుపాడులో 69 మంది ఆరు నుంచి తొమ్మిది నెలల గర్భిణులు ఉన్నారని, వారితో పాటు బాలింతలు, చిన్నపిల్లలు, మంచానికి పరిమితమై లేవలేని పరిస్థితుల్లో ఉన్న వృద్ధులను వరద ప్రమాదంపై వారికి అవగాహన కల్పించి ముందుగా సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్ధం చేయాలన్నారు. వరద సహాయక కేంద్రాలు ఎక్కడ ఏర్పాటుచేయాలి, అక్కడ ప్రజలకు భోజన, వసతి సదుపాయాలను పరిశీలించాలన్నారు. ముంపునకు గురయ్యే గ్రామాల్లో ప్రజలకు పంపిణీ చేసేందుకు మూడు నెలలకు సరిపడా బియ్యం, కందిపప్పు, వంటనూనె వంటి నిత్యావసర సరుకులను ఆయా గ్రామాల్లోని సురక్షిత ప్రాంతాల్లో సిద్ధం చేసుకోవాలన్నారు. లైఫ్ బోట్లు, లైఫ్ జాకెట్లు, రవాణా వాహనాలు, గజఈతగాళ్లను సిద్ధం చేసుకోవాలని, అదేవిధంగా ప్రమాద హెచ్చరికలు, తీసుకోవాల్సిన చర్యలను ప్రజలకు చేరవేసేందుకుకే అవసరమైన సమాచార వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో శిథిలావస్థలో ఉన్న భవనాలు, కట్టడాలను పరిశీలించి, అందులో నివసించే వారిని వరద సమయంలో తప్పనిసరిగా సహాయక కేంద్రాలకు తరలించాలన్నారు. గోదావరి నది తీరప్రాంతంలో బలహీనంగా నది గట్లను పరిశీలించి వాటిని పటిష్టం చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. గత వరద సమయంలో ఎదుర్కున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని ప్రస్తుత వరద సమయంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అధికారులు పటిష్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి ఎం.సూర్యతేజ, ఆర్‌డిఒ కె.అద్దయ్య, ఉప రవాణా కమిషనర్ శాంతకుమారి, డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాథ్, ఆర్‌డిఒ శ్రీహరి, తహశీల్దార్ చిన్నారావు, ఎంపిపి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

అడుగంటుతున్న తాగునీటి చెరువులు

గ్రామాల్లో ప్రజలకు కలుషిత నీరే దిక్కు
రోగాల బారిన పడుతున్న వైనం

అడుగంటుతున్న మంచినీటి చెరువు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోని తాగునీటి చెరువుల్లో నీరు అడుగంటుతున్నాయి. మంచినీటి చెరువులకు కాలువల ద్వారా నీరు సరఫరా చేసి రెండు నెలలు కావస్తుండడంతో గ్రామాల్లోని తాగునీటి చెరువులు అడుగంటుతున్నాయి. ఇప్పటికే మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో పంచాయతీలు కుళాయిల ద్వారా సరఫరా చేసే నీరు ఒక పూట మాత్రమే సరఫరా చేస్తున్నారు. జూన్ నెల ముగుస్తున్న ఇంకా పంటకాలువకు, తాగునీటి చెరువులకు నీటిని విడుదల చేయకపోవడంతో నీరు ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితులు నెలకొన్నాయి. నీటి విడుదల విషయమై సంబంధిత అధికారులను అడిగిన సమాధానం చెప్పే పరిస్థితిలో ఎవరూ లేరు. తమకు తెలియదని, ఇంకా సమయం పడుతుందని అంటున్నారే తప్పా కచ్చితమైన తేదీ తెలపడం లేదు. దీంతో అటు సాగుదారు రైతులు, ఇటు పంచాయతీ కార్యదర్శులు అయోమయంలో ఉన్నారు. మండల వ్యాప్తంగా 41 మంచినీటి చెరువులు ఉన్నాయి. వీటిలో దాదాపు అన్ని తాగునీటి చెరువులు అడుగంటాయి. చెరువులో నీరు అడుగంటడంతో నీరు కలుషితమై పచ్చని కట్టి వాసన వస్తున్నాయి. పలు గ్రామాల్లో తాగునీటి చెరువుల్లో నీరు దుర్వాసన వస్తున్నాయి. ఈ నీటిని చూస్తే ప్రజలు భయపడే పరిస్థితి మండల వ్యాప్తంగా నెలకొన్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో ఈ నీటిని వినియోగించాల్సి వస్తుందంటూ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నీటిని వినియోగిస్తే దురద, చర్మవ్యాధులు వస్తున్నాయంటూ ఆయా గ్రామాల్లోని ప్రజానీకం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లోని కలుషిత ఉప్పునీరు తూముల ద్వారా తాగునీటి చెరువుల్లోకి ప్రవహించడం వల్లే తాగునీటి చెరువుల్లో నీరు కలుషితమవుతుందని ప్రజలు వాపోతున్నారు. తూములను సక్రమంగా మూత వేయకపోవడం వల్లే తాగునీటి చెరువుల్లో నీరు కలుషితం అవుతుందని గ్రామస్తులు మండిపడుతున్నారు. తాగునీటి చెరువుల్లో ఉప్పు శాతం అధికంగా ఉండడంతో తెల్ల చేపలకు కళ్ళు మండి మృత్యువాత పడుతున్నాయన్నారు. ఐనప్పటికి చేపలతో తాగునీటి చెరువులను దుర్వాసన వెదజల్లుతున్నట్లు ఆయా గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. తాగునీటి చెరువులు కలుషితం కావడంతో ఆయా గ్రామాల ప్రజలు ప్రయివేట్ వాటర్ ప్లాంట్లలో తాగునీటిని కొనుగోలు చేసి తాగుతున్నారు. ఆర్థిక స్తోమత లేని వృద్ధులు, పేదలు, కలుషిత నీరే తాగి రోగాల బారిన పడుతున్నారు. తాగునీటి చెరువులు కలుషితమవుతున్నప్పటికీ ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తాగునీటి చెరువుల్లో కలుషితమైన నీరు తోడించి, తాజా తాగునీరు పెట్టాలని, అలాగే కాలువలకు నీరు విడుదల చేయగానే మొదటి ప్రాధాన్యత ఇచ్చి మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఏలూరుకు సుందరీకరణ అందాలు : ఎంఎల్ఎ బడేటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు నగరానికి సుందరీకరణ అందాలు అద్దేందుకు అందరి కృషితో ముందుకు వెళ్తున్నామని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. ఇందులో భాగంగానే చెత్తాచెదారాలను నిర్మూలించేందుకు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ వస్తున్నామన్నారు. ఏలూరులో సోమవారం తెల్లవారుజామునే పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేసిన ఆయన అపారిశుధ్య పరిస్థితులను పరిశీలించారు. ఆదేశాలివ్వడమే కాదు అవి అమలవుతున్న తీరును స్వయంగా పరిశీలిస్తూ వస్తున్నారు. సోమవారం తెల్లవారుజామునే ఏలూరు నగరంలో నెలకొన్న అపారిశుధ్య దృష్ట్యా ఆపరేషన్ స్టార్ట్ చేసిన ఎంఎల్ఎ చంటి నగరంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. అపారిశుధ్య పరిస్థితులను స్వయంగా పరిశీలించారు. అలాగే 3, 4 సర్కిళ్లలోని శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయాల్లో సిబ్బంది హాజరును పరిశీలించారు. తరచూ గైర్హాజరైన సిబ్బందిని తిరిగి క్రమశిక్షణా విధుల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వన్ టౌన్‌లోని కూరగాయల మార్కెట్ ప్రాంతంతో పాటు ఇతర ప్రాంతాల్లో ఎంఎల్ఎ పర్యటించారు. పలువురు పారిశుధ్య కార్మికులతో స్వయంగా మాట్లాడిన ఎంఎల్ఎ వారి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా నగర సుందరీకరణకు సహకరించాలని సూచించారు. స్థానిక 37వ డివిజన్‌లోని బృందావన్ పార్క్ వాకింగ్ ట్రాక్‌ను స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గాన్ని సుందర నగరంగా అభివృద్ధి చేయడానికి ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. ఇందులో భాగంగానే నగర సుందరీకరణలో కీలకభూమిక పోషించే పారిశుధ్య సిబ్బందితో తాను స్వయంగా రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి పలు కీలక సూచనలు చేశానన్నారు. వారికి పది రోజులు సమయం ఇచ్చానని, ఆ గడువు ముగియడంతో సిబ్బంది పనితీరును స్వయంగా తెలుసుకునేందుకు తానే పర్యటిస్తున్నట్లు ఎంఎల్ఎ తెలిపారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సిబ్బందిని అప్రమత్తం చేయడంతో పాటు, నిర్ణయాలు అమలును క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్ఒ డాక్టర్ మాలతి, మాజీ డిప్యూటీ మేయర్ ఛోడే వెంకటరత్నం, 37వ డివిజన్ కార్పొరేటర్ నాయుడు పృథ్వి శారద, టిడిపి నాయకులు ఆర్నేపల్లి తిరుపతి, అమరావతి అశోక్, నాయుడు సోమ పలువురు కార్పొరేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏలూరులో పర్యటిస్తున్న ఎంఎల్ఎ బడేటి చంటి

విజన్ లయన్స్ క్లబ్ ఏలూరు అధ్యక్షుడిగా రంగారావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మండలంలోని పోతునూరు శివారు ఉండ్రాజవరం గ్రామానికి చెందిన రిటైర్డ్ సీనియర్ ఉపాధ్యాయుడు జరజాపు రంగారావు ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రంగారావును ఏలూరు విజన్ లయన్స్ క్లబ్ అధ్యక్షునిగా క్లబ్ కమిటీలో ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు పి.విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ ఏలూరు విజన్ లయన్స్ జిల్లా స్థాయిలో ఉండేట్లు ఉచిత నేత్ర, దంత వైద్య శిబిరాలు, మొక్కలు నాటే కార్యక్రమం, ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు కుట్టు శిక్షణ ఇచ్చి ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ కార్యక్రమం, ఆర్థికంగా వెనుకబడిన విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, అనాథలకు, వృద్ధులకు, సేవా కార్యక్రమాలు, విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీ, వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ ఛైర్మన్ వి.రత్నకుమారి, జోన్ ఛైర్ పర్సన్ ఎ.రాఘవరావు, క్లబ్ సీనియర్ నాయకులు బి.వి.రమణమూర్తి, చుక్కా అనిసాక్‌రాజు, ఎ.శివకుమార్, వి.హరికుమార్, వి.శ్రీనివాసరావు, సిహెచ్.పావని, సెక్రటరీ ఆర్‌వి.అనిల్‌కుమార్, ఎస్.బాబి పాల్గొన్నారు.


బస్సు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ఆర్‌టిసి బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెంలో ఎపిఎస్ ఆర్‌టిసి డిపోకు చెందిన మూడు కొత్త బస్సులను ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం కొత్త రూట్లకు నూతన బస్సులు నడపాలన్నారు. అన్ని విధాలుగా ఆర్‌టిసి అభివృద్ధికి తన సహకారం ఉంటుందన్నారు. ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రయాణించేలా బస్సులు నడపాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం జంగారెడ్డిగూడెం మండలానికి చెందిన ఒక వికలాంగుడు తనకు రూ.15 పెన్షన్ వచ్చే విధంగా చూడాలని ఎంఎల్ఎను కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండలాధ్యక్షులు, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

పేదరికం చదువుకు అడ్డు రాకూడదని, ప్రతిఒక్కరూ కష్టపడి చదువుకోవాలని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. మండలంలోని యర్రంపల్లి గ్రామంలో కొమ్ము రాంబాబు తన కుతురు సమీక్షకు చదువుకు చదవడానికి ఆర్థిక స్తోమత లేక, ఎటువంటి ఆధారం లేక నిస్సహాయ స్థితిలో ఎంఎల్ఎ రోషన్‌కుమార్ దృష్టికి విషయం తీసుకొచ్చారు. వెంటనే ఎంఎల్ఎ, ఆయన సతీమణి విజయ స్పందించి పేదరికం చదువుకు అడ్డు కాకూడదని తక్షణ సహాయంగా రూ.పది వేలు ఆర్థిక సాయం సమీక్షకు అందించారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - చింతలపూడి

డయేరియా, మలేరియా, డెంగీ వంటి ప్రాణాంతక వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని టిడిపి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడ నాగభూషణం చెప్పారు. కాచీ, వడకట్టి చల్లార్చిన నీటిని తాగాలని కోరారు. మండలంలోని పాత చింతలపూడి గ్రామంలో వైరల్ ఫీవర్స్ ఎక్కువగా ఉండటంతో ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ ఆదేశాల మేరకు సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. టిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడి కూటమి ప్రభుత్వం ప్రజలకు పూర్తిస్థాయిలో వైద్య సేవలందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. అన్ని సచివాలయాల అధికారులు పారిశుధ్యం, తాగునీటి సరఫరాకు సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ సెల్ చింతలపూడి టౌన్ అధ్యక్షుడు కర్లపూడి రాజారత్నం, సీనియర్ నాయకులు గన్నమనేని వాసు, తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మద్దిపూడి నాగేశ్వరమ్మ, ఆచారి, బోద సాగర్, నాగేంద్ర చింతలపూడి అర్బన్ హెల్త్ సెంటర్, యర్రగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది గృహాలను సందర్శించి జ్వరాలు, డయేరియా సర్వే నిర్వహించారు.

పాఠశాలలో యుటిఎఫ్ సభ్యత్వ క్యాంపెయిన్

ఏలూరు :యుటిఎఫ్ ఏలూరు నగర శాఖ స్వర్ణోత్సవాల సందర్భంగా ఏలూరులోని మున్సిపల్ పాఠశాలలో ఆదివారం సభ్యత్వ క్యాంపెయిన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.రవికుమార్, జిల్లా కార్యదర్శి ఈడే శివకుమారరావు, నగర గౌరవ అధ్యక్షులు ఎం.చిట్టిబాబు, అధ్యక్షులు షేక్ పర్వీన్ బేగం, జిల్లా కార్యవర్గ సభ్యులు కెవి.అప్పారావు, ఏలూరు నగర శాఖ ప్రధాన కార్యదర్శి బోగ్గాని కూటి రాజారావు, యుటిఎఫ్ సీనియర్ కార్యవర్గ సభ్యులు ఆర్‌డిజెకే.వరప్రసాద్, సిహెచ్.షణ్ముఖ్, డి.జగదీష్, ఎం.రామచంద్రరావు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా ద్వారకాతిరుమల మండల సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు చెలికాని రాజబాబు మాట్లాడుతూ అనేక సంక్షేమ పథకాలు అమలుచేసిన రాజశేఖర్ రెడ్డి ప్రతి పేద వాడి గుండెల్లో చిరస్మరణీయంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షులు ప్రభాసవేని వాసు, ఎంపిపి బొండాడ మోహిని వెంకన్న బాబు, జెడ్‌పిటిసి సభ్యులు చిగురుపల్లి సామ్యూల్, ఎంపిటిసి సభ్యులు రుద్ర సూర్య కళా వెంకట శివాజీ, మండల యూత్ ప్రెసిడెంట్ పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, పార్టీ ప్రెసిడెంట్ అల్లిత ఏసుబాబు, దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు పెద్దిరెడ్డి వీర్ల జ్యోతి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నూజివీడు టౌన్ : పట్టణంలో నిర్వహించిన జయంతి వేడుకలకు నూజివీడు మాజీ ఎంఎల్ఎ మేకా వెంకటప్రతాప్‌అప్పారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక చిన గాంధీ బొమ్మ సెంటర్‌లో కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మేకా వెంకటప్రతాప్ అప్పారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, రామిశెట్టి మురళి, వైస్ ఛైర్మన్ పగడాల సత్యనారాయణ, వైసిపి పట్టణ అధ్యక్షులు శీలం రాము, కొన్నిలర్లు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చింతలపూడి : చింతలపూడి నగర పంచాయతీలో ఫైర్ స్టేషన్ వద్ద వైఎస్ఆర్ విగ్రహానికి వైసిపి చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు, మండల కన్వీనర్ జగ్గవరపు జానకిరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. అనంతరం పాత బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, మిర్యాల దిలీప్, వెంప కృష్ణ, గిరిథ్‌గారావు, రాంబాబు, భరత్ రెడ్డి, ప్రముఖ నాయకులు పాల్గొన్నారు.

చింతలపూడి నగర పంచాయతీలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద మాజీ ఎంఎల్ఎ ఉన్నమట్ల ఎలీజా ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : మండలంలోని కొమ్మర గ్రామంలో వైఎస్ఆర్ విగ్రహానికి ఎంపిపి బొండాడ మోహిని వెంకన్నబాబు పార్టీ నేతలతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముసునూరు : ముసునూరులో రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రేగుల గోపాలకృష్ణ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచి ఆర్.గోపాలకృష్ణ, మాజీ సర్పంచి బి.సుబ్బారావు, ఎంపిటిసి సభ్యులు రవి, రామారావు, అనిల్, జగదీష్, వి.సాంబశివరావు, రేగుల నరసింహారావు, వార్డు మెంబర్ మోజేషు, గంగాధర్, జ్ఞానేషు, రంగారావు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం టౌన్ : పట్టణంలో వైసిపి పట్టణ అధ్యక్షులు చిటికెల అమ్మతరామయ్య ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన నాగలక్ష్మి, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌చార్జి కంభం విజయరాజు, పోలవరం పరిశీలకులు జెట్టి గురునాధరావు, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జీ, వైసిపి సీనియర్ నాయకులు రాజాపు వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్, ముప్పిడి వీరాంజనేయులు, ముప్పిడి శ్రీను, బత్తిన చిన్న, కౌన్సిలర్లు పిపిహెచ్.చంద్రరావు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. గుంగసమ్మ ఆలయం సెంటర్ వద్ద ఉన్న రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలవేసి అనంతరం కేక్ కట్ చేసి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం జంగారెడ్డిగూడెం పట్టణంలో ఉన్న డాక్టర్ వైఎస్.రాజశేఖర్ ఒడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం అరుంధతి కాలనీ వద్ద రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి మాజీ ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పూలమాలలు వేసి కేక్ కట్ చేసి స్థానిక ప్రభుత్వ హాస్పిటల్‌లో రోగులకు పాలు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఆరేటి రత్నాజి, బుట్టాయగూడెం ఎంపిటిసి సభ్యులు తెల్లం రమణ, సర్పంచులు, వైసిపి సీనియర్ నాయకులు, ఆరేటి సత్యనారాయణ, సయ్యద్ బాజీ, బానోతు కృష్ణనాయక్, తెల్లం చిన్నారావు, నక్కా శివాజీ, కలపాల విస్సు, కణితి దుర్గారావు, ఉండవల్లి సురేష్, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి : లక్ష్మీపురం గ్రామ జాతీయ రహదారి వద్ద ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి కొల్లూరి రాంబాబు ఆధ్వర్యంలో జెట్టి గురునాధరావు చేతులమీదుగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. జీలుగుమిల్లిలో ఎంపిపి కోర్స పోసమ్మ వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ములగలంపల్లిలో వైస్ ఎంపిపి సోమగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు మల్లం వసంత్, ఎంపిటిసి సభ్యులు సున్నం సురేష్, సందా ప్రసాద్, శ్రీనివాసరెడ్డి, సర్పంచులు ఉపారాణి, జగదాంబ, ఉప సర్పంచి రాయపరెడ్డి పాల్గొన్నారు.

ముదినేపల్లి : మండలంలోని పెయ్యేరు, ముదినేపల్లి, చిగురుకోట వైవాక తదితర గ్రామాల్లో వైసిపి నాయకుల ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదినేపల్లి మండల ప్రజా పరిషత్ అధ్యక్షులు రామిశెట్టి సత్యనారాయణ, పార్టీ మండలాధ్యక్షులు మొట్రూ ఏసుబాబు, నిమ్మగడ్డ బిక్షాలు, పార్టీ నాయకులు కోమటి విష్ణువర్ధన్, బత్తిన కిషోర్, చిన్ని, వైస్ ఎంపిపి రాయిని రాధ, మేడూరి వెంకటేశ్వరావు, జొన్న చంటి, సాక్షి సాయిబాబు, కొల్లి నాని, గంటా కోటేశ్వరరావు, మండల కో- ఆప్షన్ సభ్యులు షేక్ అల్లాబక్ష్, మెరుగుమాల వెంకటేశ్వరావు, సోమ సత్యనారాయణ, పెయ్యేరు వైస్ సర్పంచి దిడ్ల సతీష్, పేరం కిషోర్, రంగిశెట్టి కొండా, పోకల కృష్ణ పాల్గొన్నారు.

నరసాపురం : మండలంలోని టి.నరసాపురం పంచాయతీలోని కృష్ణాపురంలో వైసిపి గ్రామ కమిటీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్ జయంతిని పురస్కరించుకుని మొక్కలు నాటారు. తొలుత ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అదేవిధంగా టి.నరసాపురం గాంధీ సెంటర్‌లో, తిరుమలదేవిపేట, బొర్రంపాలెం గ్రామాల్లో వైఎస్ఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలని వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

తమ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బుట్టాయగూడెం మండల కేంద్రంలోని గిరిజనులు కోరారు. ఈ మేరకు ఇళ్ల స్థలాల పోరాట కమిటీ నాయకుల ఆధ్వర్యంలో ఎంఎల్ఎ చిర్రి బాలరాజుకు సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండేళ్లుగా బుట్టాయగూడెం మండల కేంద్రం ప్రభుత్వ భూమిలో ఇళ్లు వేసుకుని ఉంటున్నామని, విద్యుత్, తాగునీరు, రోడ్డు సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. దీనిపై ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని చెప్పారు. మండల కేంద్రంలో రెండేళ్లుగా ఇళ్ల నిర్మించుకుని ఉంటున్న గిరిజనులకు విద్యుత్ సౌకర్యం లేకపోవడం సరికాదని, గిరిజనుల సమస్య పరిష్కరించేందుకు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం డిఇతో ఫోన్‌లో మాట్లాడి రెండు రోజుల్లోనే ఆ గ్రామంలో పర్యటించి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు తెల్లం వెంకటలక్ష్మి, మంగరాజు, మరియమ్మ, చంద్రరావు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీల బకాయిలు చెల్లించాలి
వ్యవసాయ కార్మిక సంఘం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

ఉపాధి హామీ కూలీలకు బకాయిలు విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జంగారెడ్డిగూడెం మండల కమిటీ డిమాండ్ చేసింది. జంగారెడ్డిగూడెం ప్రజాసంఘాల కార్యాలయంలో వ్యవసాయ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం మండల కమిటీ సభ్యులు పిల్లి దుర్గారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి అందుకురి ప్రభాకరరావు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మండలంలోని ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు గత 15 వారాలుగా వేతన బకాయిలు ఉన్నాయన్నారు. పనుల్లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఉపాధి హామీ చట్టం జీవనోపాధిగా మారిందన్నారు. ఈ క్రమంలో ఎక్కువ కాలం వేతనాలు పెండింగులు ఉండటంతో ఉపాధి కూలీలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ కూలీలకు పే స్లిప్పులు ఇవ్వడంలో వేతన బకాయిలు విడుదల చేయడంలో జాప్యం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే మండల పరిధిలో ఉన్న వేతన బకాయిలు విడుదల చేయాలన్నారు. 200 రోజులు పనులు కల్పించాలని రూ.600 వేతనం పెంచాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన, ధర్నా కార్యక్రమాలు చేపడతామని సంబంధిత అధికారులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జె.సూరి చంద్రరావు, యాగంటి సీత, వి.నరసరావు, నేపాల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు నోటిఫికేషన్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

భారత వాయుసేనలో అగ్నివీర్ పథకంలో భాగంగా అగ్నివీర్వాయు ఉద్యోగాల నియామకం కోసం భారత వాయు సేన నోటిఫికేషన్ విడుదల చేసిందని జిల్లా ఉపాధి అధికారి మధుభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగాలకు జులై 2004 నుంచి జనవరి 2008 మధ్య జన్మించి, మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టుల్లో ఇంటర్మీడియట్, ఒకేషనల్, పాలిటెక్నిక్ కనీసం 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారు http://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌లో ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ పరీక్ష అక్టోబర్ 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు. అభ్యర్థులకు ఈ ఉద్యోగాల పట్ల అవగాహన కల్పించేందుకు ఈ నెల 12వ తేదీన భీమవరం డిఎన్ఆర్ డిగ్రీ కళాశాల హాలులో, ఈ నెల 16వ తేదీన ఏలూరు సర్‌సిఆర్ రెడ్డి కళాశాలలో వాయుసేన సికింద్రాబాద్ వారితో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత ఆసక్తి కలిగిన యువత ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అనారోగ్య బాధితురాలికి సాయం

ప్రజాశక్తి - చింతలపూడి

లింగపాలెం మండలం యడవల్లి గ్రామానికి చెందిన కొమ్ము వెంకటేశ్వరమ్మ అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ సతీమణి విజయ వెంటనే స్పందించి గుంటూరు హాస్పిటల్ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని చెప్పారు. వెంకటేశ్వరమ్మ తల్లికి హాస్పిటల్ ఖర్చుల నిమిత్తం అట్లూరి శ్రీనివాసరావు ద్వారా రూ.ఐదు వేలు ఆర్థిక సాయం అందించి, గుంటూరు హాస్పిటల్‌కు వెళ్లేందుకు ప్రయాణం ఏర్పాట్లు చేశారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి
హైవే సేఫ్టీ అధికారులకు ఎంఎల్ఎ చింతమనేని సూచన

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాల పరిధిలోని జాతీయ రహదారిపై ప్రమాదాలు ప్రజా ప్రాణాలను సంకటంగా మారిన అవకతవక డిజైన్‌లకు శాశ్వత పరిష్కారం చూపేలా డిజైన్లు రూపొందించాలని హైవే సేఫ్టీ అధికారులకు దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సూచించారు. నేషనల్ హైవేపై అవసరమైన చోట్ల సర్వీస్ రోడ్లు, కల్వర్టులు లేకపోవడం, రోడ్లు అధ్వానంగా ఉన్నచోట్ల కనీస మరమ్మతులు చేపట్టక పోవడంతో ఎంతో మంది ప్రజల ప్రాణాలు పోతున్నాయని ఇటీవల జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు అధికారులకు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. ఈ విషయంలో అధికారులు సత్వరమే స్పందించి చర్యలు చేపట్టాలని కోరారు. దీనిలో భాగంగా సోమవారం సాయంత్రం దుగ్గిరాలలోని హైవేపై నేషనల్ హైవే ఇంజినీరింగ్ అధికారులతో కలిసి ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ పలు ప్రాంతాలను పరిశీలించారు. ప్రమాదాల నివారణకు, ప్రజల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకుని శాశ్వత ప్రాతిపదికన మెరుగైన డిజైన్లు రూపొందించి సత్వరమే పనులు ప్రారంభమయ్యేలా చూడాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవే సేఫ్టీకి చెందిన పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

12-1(సి) విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 12-1(సి) జిఒలో సీట్లు పొందిన విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని పిడిఎస్‌యు ఆధ్వర్యంలో ఈరోజు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జెసి లావణ్యవేణికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు కాకి నాని మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం 2009లో భాగంగా గత వైసిపి ప్రభుత్వం 2022-23 విద్యా సంవత్సరంలో 12-1(సి) జిఒ ద్వారా పేద బడుగు బలహీన తరగతుల విద్యార్థులను కార్పొరేట్ ప్రయివేట్ విద్యాసంస్థల్లో 25 శాతం ఉచిత సీట్లలో చదువుకునే అవకాశం కల్పించిందన్నారు. ఆ జిఒ ఇచ్చిన ప్రకారం అర్బన్ ప్రాంతమైతే రూ.ఎనిమిది వేలు, రూరల్ ప్రాంతమైతే రూ.6,500 కట్టాలని, అది కూడా ప్రభుత్వం చెల్లిస్తుంది అమ్మఒడి డబ్బుల్లోంచి కట్టాలని ప్రభుత్వం జిఒలో స్పష్టంగా తెలియజేసిందని, ప్రభుత్వం మారిన నేపథ్యంలో అమ్మ ఒడి పథకం కొనసాగించే అవకాశం లేనందున ప్రస్తుత టిడిపి ప్రభుత్వం ఎటువంటి ప్రకటన చేయనందున చాలా యాజమాన్యాలు 12-1(సి)లో సీట్లు వచ్చినటువంటి విద్యార్థులను ఫీజులు కట్టమని స్కూల్లో యాజమాన్యాలు తల్లిదండ్రులను ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. ఈ విషయమై చాలాసార్లు విద్యాశాఖ అధికారులను అడిగినప్పటికీ ఎటువంటి స్పందన లేదని, ఫీజులు కట్టకున్న ఒత్తిడి గురి చేసిన పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో కచ్చితంగా తల్లిదండ్రులని సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం మొదలు పెడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎం.క్రాంతి, వై.సునీల్ పాల్గొన్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
ఎస్ఐ పవన్‌కుమార్

ప్రజాశక్తి - పోలవరం

వర్షాకాలంలో గోదావరి వరదలు, కొండవాగుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ పవన్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ ఈ వర్షా సీజన్‌లో గోదావరి వరద ప్రవాహం, కొండవాగుల ప్రవాహం ఎక్కువగా ఉంటుందని ప్రజానీకం కొండవాగులు దాటే సందర్భంలో గోదావరి ప్రయాణాలు చేసే సందర్భాల్లో అప్రమత్తంగా ఉండాలని, విద్యార్థులు, యువకులు స్నానాలకు ఉత్సాహపడటం, సెల్ఫీల కోసం ప్రయత్నాలు చేయరాదని సూచించారు. వర్షాలు వరదల వల్ల వన్యప్రాణులు, పాములు, జలచరాలు మధ్యకు వచ్చే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసు వారికి సమాచారం అందించాలని 9440796664 తెలపాలని కోరారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు సత్కారం

ప్రజాశక్తి - ఉంగుటూరు

రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ రామచంద్రాపురం నుంచి అమరావతి వెళ్తూ మార్గమధ్యలో మండలంలోని నారాయణపురంలో ఆగారు. చేబ్రోలు గౌడ శెట్టి బలిజ సంక్షేమ సంఘం అధ్యక్షులు శీలం పల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులు మారిశెట్టి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి శీలబోయిన కిషోర్ శాలువా కప్పి మంత్రికి సత్కారం చేసి వెంకటేశ్వర స్వామి ప్రతిమను బహూకరించారు. సహాయ కార్యదర్శి దొంగల లక్ష్మీనారాయణరాజు, కోశాధికారి కట్టా వెంకట్, కముజు గంగాధరరావు, సంఘ సభ్యులు, టిడిపి ఉంగుటూరు మండల ఎస్‌సి సెల్ అధ్యక్షుడు నేతుల ఆశీర్వాదం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతిఒక్కరూ చిన్ననాటి నుంచి చెడు మార్గాలకు దూరంగా మంచి మార్గం వైపు పయనిస్తూ తల్లిదండ్రులను గౌరవిస్తూ గురువుల పట్ల భయభక్తులు కలిగి ఉండి జీవనం కొనసాగించాలని నూజివీడు డిఎస్‌పి గోలి లక్ష్మయ్య అన్నారు. దెందులూరు మండలం శ్రీరామవరం గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలను ఆయన సోమవారం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి మాట్లాడారు. వారు భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు వెళ్లాలని ఆకాంక్షించి పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా డిఎస్‌పి గోలి లక్ష్మయ్య మాట్లాడుతూ రూ.వంద కోట్లు ఉన్నప్పటికీ విద్య లేకపోతే అతను పేదవాడేనని, సంప్రదాయ ప్రకృతి దగ్గరగా మంచి ఆలోచన విధానంతో జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎల్ఎను కలిసిన వెలుగు సిఎలు

ప్రజాశక్తి - చింతలపూడి

మహిళలకు డ్వాక్రా గ్రూపుల ద్వారా ఇచ్చే ప్రభుత్వ పథకాలు అందించాలని ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. చింతలపూడి మండలంలో పనిచేస్తున్న వెలుగు సిఎలు ఎంఎల్ఎను ఆయన స్వగృహం వద్ద ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సిఎలు వారి సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఆయన వారితో మాట్లాడుతూ ఉమ్మడి కూటమి నాయకులు, కార్యకర్తలు అందరిని కలుపుకొని పథకాలను ప్రజలకు అందించాలని అన్నారు. ఈ సందర్భంగా సిఎలు హర్షం వ్యక్తం చేశారు. ఆయనను శాలువతో ఘనంగా సత్కరించారు.

వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చల్ల చింతలపూడి గ్రామ పరిధిలో వ్యవసాయ పొలాలు మునిగి రోడ్లపైకి ఇళ్లలో వాడకపు నీరు వర్షపు నీరు వచ్చి చేరుతున్న నేపథ్యంలో గ్రామస్తులు, రైతులకు ఇబ్బందులు వస్తే వెంటనే స్పందించి సేవా కార్యక్రమాలు చేయండని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ ఇప్పటికే ఆదేశాలు, సూచనలు ఇచ్చిన నేపథ్యంలో టిడిపి చల్ల చింతలపూడి నేతలు స్పందించారు. చల్ల చింతలపూడి గ్రామానికి చెందిన టిడిపి మండల కార్యదర్శి, మాజీ వైస్ ఎంపిపి నాగిన బోయిన సత్యనారాయణ, మాజీ సర్పంచి ఉమ్మడి మోహన్‌రావు, టిడిపి గ్రామ అధ్యక్షుడు వేమన రాము గౌడ్, పార్టీ సీనియర్ నేత మొదుమూడి రాంబాబు, గ్రామ పార్టీ ఆధ్వర్యంలో వర్షపునీరు ముదురుగునీరు నిల్వ లేకుండా పొలాలు మునిగిపోకుండా, మునిగిన నీరు బయటకు పోయేందుకు జెసిబి యంత్రం సహాయంతో నీరు బయటకు వెళ్లే విధంగా పనులు చేయించే కార్యక్రమాన్ని సోమవారం చేయించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మొదుముమూడి వెంకటరాజు, పండు వేమన సత్యనారాయణ, బిజెపి నేత వేమన గణపతి, బాలిన నాగరాజు పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా యావన్మంది ప్రజలకు తెలియజేయునది ఏమనగా ... ఏలూరు జిల్లా, చింతలపూడి మండలం, రేచర్ల గ్రామంలోని గల ... ఆర్.ఎస్.నెం. 98/3, కొలత ఎకరములు ... ఈ ఆస్తిని ... కొనుగోలు చేయుటకు ... అభ్యంతరములు ఉన్నచో ఈ ప్రకటన వెలువడిన 7 రోజులలోపు క్రింది చిరునామాకు తెలియజేయగలరు.

షెడ్యూలు ఆస్తి

ఏలూరు జిల్లా, చింతలపూడి సబ్ రిజిస్ట్రార్ పరిధిలో, చింతలపూడి మండలం, రేచర్ల గ్రామంలోని గల ... సర్వే నెం. ... దస్తావేజు నెం.9211/2024 ...

పలివెల గణేష్‌బాబు
అడ్వకేట్, కొత్తగూడెం, 9849246278

పాస్‌పోర్టు పోయినది

ప.గో.జిల్లా, పోడూరు మండలం, కవిటం, డోరు నెం. 5-123, నివాసి పాలా రంగారావు గారి కుమారుడు పాలా వెంకన్న అను నేను 15-6-2024 తేదీన పాలకొల్లు బస్టాండ్ నుండి మెడికల్ క్లినిక్ కు వెళ్తుండగా పాలకొల్లు మెయిన్ రోడ్డు ఏరియా నందు నా యొక్క ఒరిజినల్ పాస్ పోర్టు పడిపోయినది. నా పాస్ పోర్ట్ నెంబర్ L1437394. నేను ఎంతవెతికినా దొరకలేదు. కావున ఎవరికైనా దొరికిన యెడల నాకు అందజేయవలసినదిగా కోరి ప్రార్థించుచున్నాను.

పాలా వెంకన్న, S/o.రంగారావు,
H.No. 5-123, కుమ్మర వారి వీధి,కవిటం,
పోడూరు మండలం, ప.గో.జిల్లా, ఫోన్. 9177191971